క్లుప్తంగా

బుడగ జంగాల సమస్యలు పరిష్కరించండి



పెదకూరపాడు: బుడగ జంగాల సమస్యలను పరిష్కరించాలని పెదకూరపాడు తహసీల్దార్ మీసాల దానియేలుకు ఆ సంఘ సభ్యులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఎంతోకాలంగా నివాసముంటున్న ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని, 75 తాళ్లూరు బుడగ జంగాల కాలనీలో మౌలిక వసతులు, తాగునీరు సౌకర్యాన్ని కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కిన్నర అచ్చయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో గీతాజయంతి శోభాయాత్ర



అచ్చంపేట: హిందువుగా జన్మించడం పూర్వ జన్మ శుకృతమని, అందుకు ప్రతి హిందువు గర్వపడాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి పడగండ్ల లక్ష్మాచారి అన్నారు. గీతా జయంతి సందర్భంగా మండల కేంద్రమైన అచ్చంపేటలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించిన మార్గంలో అందరూ మెలగాలన్నారు. నాది అనే అహంకారాన్ని వదిలి మనం అనే విధంగా ప్రవర్తించాలన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట, కొత్తపల్లి గ్రామాలకు చెందిన ఆర్ఎంపీలు కట్టికోట వడులయ్య, వల్లెబోయిన శ్రీనివాసరావులు 150మందికి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. స్థానిక విద్వాన్ పాఠశాల ఇన్‌ఛార్జ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తిరుపతి స్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో లద్దెపురుగును నివారించాలి



నార్నెపాడు(ముప్పాళ్ళ): మొక్కజొన్న పంటపై పొగాకు లద్దెపురుగు ఆశించిందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శివకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా డీడీ శివకుమారి మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొగాకు లద్దె పురుగు నివారణకు విషపుఎరలను వాడాలని సూచించారు. విషపుఎరలను 10 కేజీల తవుడును రెండు కేజీల బెల్లం, ఒక లీటర్ మోనోక్రోటోఫాస్‌ను కలిపి ఉండలుగా తయారు చేసుకొని పొలంలో చల్లాలని సూచించారు. ఏఓ ఎం.అరుణ మాట్లాడుతూ తుఫాన్ వలన వచ్చే రెండు, మూడు రోజుల్లో వర్షం పడే అవకాశం ఉందని చెబుతున్న నేపథ్యంలో వరి పంట కోతలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. మొక్కజొన్న, శనగ పంట వేసిన రైతులు పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలంటే తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రియాంక, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఆహారాన్ని వృథా చేయవద్దు



పెదకూరపాడు: ఆహారం మిగిలితే వృథా చేయవద్దని జనచైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు అన్నారు. అమరావతి మండలం లింగాపురం గ్రామంలో ఓ ఫంక్షన్‌లో మిగిలిన ఆహారం గురించి తెలుసుకున్న సంస్థ ప్రతినిధులు అక్కడికి వెళ్లి మిగిలిన ఆహారాన్ని తెచ్చి పెదకూరపాడు మండలంలోని 75 త్యాళ్లూరు శాంతికాలనీలో బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ లియాఖత్ ఆలీ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జన చైతన్య సమితి బృందం ప్రతినిధులు కొరప్రాటి వెంకటేశ్వర్లు, మాదాల శ్రీనివాసరావు, దాసరి విజయ్ బెన్ని బాబు తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఈపూరు (శావల్యాపురం): ఈపూరు మండల పరిధిలోని కొండ్రముట్లలో కోదండ రామ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్రహ్మణేశ్వరస్వామి, గణపతి,వీరాంజనేయ స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

సచివాలయంపై శీతకన్ను

- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎత్తుగడ
- సచివాలయ సేవలకు భారీ కోత
- ఉద్యోగులకు ఇతర పనులు పురమాయిస్తున్న వైనం
- అలంకారప్రాయంగా కార్యాలయాలు
- సేవలు అందక ప్రజల అవస్థలు



నెమలికల్లులో గత ప్రభుత్వం నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

అమరావతి: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన కృషి ఫలితం గ్రామాలలోనే అనేక సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి తద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చింది. నేడు కూటమి ప్రభుత్వం క్రమేపి సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను కొన్నాళ్లు త్రిశంకు స్వర్గంలో ఉంచి నేడు పూర్తిగా లేకుండా చేసింది. సచివాలయ వ్యవస్థను కూడా నీరు గార్చేలా ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేసి, వ్యవస్థ లక్ష్యాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. దీంతో గ్రామ స్వరాజ్యం మాట దేవుడెరుగు అసలు పాలన అస్తవ్యస్తంగా తయారవుతోంది.

సచివాలయం.. వలంటీర్ అనుసంధానం అద్భుతం

మండల కేంద్రానికి దూరంగా ఉండే గ్రామాల ప్రజలు 2019కి ముందువరకు ప్రతి చిన్న సమస్యకు మండల కేంద్రంలో ఉండే రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెట్టేవారు. ఈ క్రమంలో ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి అక్కడకు చేరుకుంటే అక్కడ అధికారులు అందుబాటులో లేకపోవటమో, ఇతర కారణాల వల్ల పనుల కాక నాలుగైదు సార్లు ఆఫీస్‌ల చుట్టూ తిరిగాల్సిరావటంతో అనేక ఇబ్బందులు పడేవారు. కూలి పని చేసుకునే వారైతే ఆ పనులు మానుకుని రోజంతా కార్యాలయాల దగ్గర వేచిఉండటంతో కూలీరాక పోగా దారిఖర్చులు పెరిగి రెండు విధాలుగా నష్టపోయేవారు. దీంతో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పరిస్థితిని దూరం చేయాలనే సంకల్పంతో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంత ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన పనిలేకుండా చేశారు. ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయ వ్యవస్థకు వలంటీర్ వ్యవస్థను అనుసంధానం చేసి పేద ప్రజలకు ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటకే తెచ్చారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

అమరావతి మండల పరిధిలో ఉన్న 19 గ్రామ పంచాయతీలలో ప్రతి 3వేల మంది జనాభాకు ఒక సచివాలయం చొప్పున 16 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాల్లో 11 శాఖల ఉద్యోగులు అక్కడే ఉండి సేవలు అందించారు. ఆధార్‌కార్డుల మార్పులు చేర్పులు, విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలు, మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ సేవలలో 1బి, అడంగల్, పట్టాదారు పాస్ పుస్తకాలకు, రైతులకు అవసరమైన అన్ని సేవలు సమీపంలో ఉన్న సచివాలయానికి వెళ్తే సకాలంలో అందేవి. సంక్షేమ పథకాలకు సులువుగా దరఖాస్తు చేసుకునే పరిస్థితులు ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసి సచివాలయాలనుంచి నేడు పలుసేవలనురద్దు చేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏ పని కావాలన్నా వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పథకాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన పనులు చేయటంతో నిరక్ష్యరాశ్యులైనవారికి, మహిళలకు ఎంతో సౌకర్యంగా ఉండేది ప్రస్తుతం సచివాలయాల్లో ఏ పనులు జరక్క చాలా ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా గ్రామసచివాలయాలలో పౌరసేవలు పెంచాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..



గత ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించటానికి సచివాలయ వ్యవస్థతో వలంటీర్లు కలిసి పనిచేస్తే అద్భుతంగా ప్రభుత్వ పథకాలు ఇంటింటికి సకాలంలో అందించటానికి వీలుండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థనే నీరుగార్చేవిధంగా వ్యవహరిస్తోంది. సచివాలయల్లో పనులు జరక్కపోవటంతో మండల కేంద్రంలోని ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

– నాయుడు రాంబాబు, సర్పంచ్, ఎండ్రాయి

అన్ని సేవలు అందుబాటులోకి తేవాలి



గత ప్రభుత్వ హయాంలో సచివాలయంలో 500లకు పైగా సేవలు అందుబాటులో ఉండేవి. ఏపనైనా సచివాలయానికి వెళితే అవుతుందనే నమ్మకం కలిగింది. ప్రస్తుతం సచివాలయంలో అన్నిశాఖల సిబ్బంది ఉండటం లేదు. ప్రజలు సేవలకోసం సచివాలయాలకు వచ్చి పనికాక వెనుదిరిగిపోతున్నారు. గతంలో వలే సచివాలయంలో అన్ని సేవలు అందుబాటులోకి తేవాలి.

– తోకల సూరిబాబు, పట్నంమాలపల్లి, అమరావతి

సర్పంచులకు ముగిసిన మొదటి విడత శిక్షణ



ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు, అధికారులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా సర్పంచ్‌లు, అధికారులకు ఎల్ఎస్‌డీజీ మొదటి విడత శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పాల్గొని ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవడంలో భాగంగా గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో అభివృద్ధి జరిగినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలందుతాయన్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వ అధికారులు పనిచేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన ఆరోగ్య సంరక్షణ చర్యలు గురించి వివరించారు. ఈ నెల 19 వరకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి బాల్య వివాహాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎంఈఓ శ్రీనివాసరావు, టీపీ ప్రదీప్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి పాటుపడాలి..

నకరికల్లు: శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పరిపాలనలో జోడిస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ జి.కాశయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు మొదటి విడత బుధవారం పూర్తయ్యాయి. కార్యక్రమంలో సహాయ కోర్సు డైరెక్టర్ కె.వి.శివప్రసాద్, మండలస్థాయి అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, ఆరోగ్యశాఖ సిబ్బంది, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా వనరులు వినియోగించుకుని సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా సమష్టి కృషితో పంచాయతీలను అభివృద్ధి చేయాల్సి ఉందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మండల ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ అధికారులకు శిక్షణ కార్యక్రమం రెండవరోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పలు లక్ష్యాలను ఎంపీడీవో వివరించారు. పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్ యు.మల్లికార్జున్, ఉపాధి హామీ ఏపీఓ వెంకటేశ్వర్లు, వెలుగు ఏపీఎం కృపావేణి, పంచాయితీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

పెదకూరపాడులో...

పెదకూరపాడు: సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా గ్రామస్థాయిలో పనిచేసే ప్రతి ఉద్యోగి లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని అమలుపరిచేలా కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ కోరారు. పెదకూరపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలుదేవర్లపాడులో రెవెన్యూ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మండల సర్వేయర్ సుధాకర్, పక్కన తహసీల్దార్ ఎం.భవానిశంకర్

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు బుధవారం జరిగింది. సదస్సులో తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 6 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. వీటితో పాటుగా మరో 15 రేషన్ కార్డుల కోసం అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ సుధాకర్, సర్పంచ్ కెజియా రాణి, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



చల్లగరిగలో బర్త్ సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస యాదవ్

అచ్చంపేట: ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బర్త్ సర్టిఫికెట్స్ మొత్తాన్ని రెవెన్యూ సదస్సులో ఇచ్చినట్లు తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. మండలంలోని చల్లగరిగలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై 37మంది దరఖాస్తులు అందచేశారు. వాటిలో 20 పరిష్కరించగా 17 సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తహసీల్దారు చెప్పారు. ముఖ్యంగా ఇంటి నివేశన స్థలాల కోసం ఎక్కువమంది దరఖాస్తు చేశారన్నారు. కార్యక్రమంలో 14 మందికి పుట్టిన తేది ధ్రువీకరణ పత్రాలు, ముగ్గురికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పసుపులేటి పాపిరెడ్డి, వీఆర్వోలు, సర్వేయరు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరంబోకు భూములకు పట్టాలివ్వాలి..

గరికపాడు(క్రోసూరు): పేదల సాగు చేసుకుంటున్న పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలి లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైనా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు పేర్కొన్నారు. క్రోసూరు మండలం గరికపాడు గ్రామంలో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసరావుకు ఈమేరకు రవిబాబు వినతి పత్రం అందజేశారు. సదస్సులో పలువురు రైతులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏపూరి వెంకటేశ్వర్లు, షేక్ పెదమాబు, సాహెబ్ షేక్ మహమ్మద్ షా, షేక్ సలీం పాల్గొన్నారు.

గంగిరెడ్డిపాలెంలో...

బెల్లంకొండ: గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అఫ్షపున్నీసా బేగం తెలిపారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపాలెంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆర్ఐ పవన్ కుమార్, దేవదాయ శాఖ అధికారి రామకోటి రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆసుల జగన్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

- పెదకూరపాడు మండలంలో అమరావతి మేజర్ పై ఆరు నీటి వినియోగదారు సంఘాలు
- లింగంగుంట్ల మేజర్ పై ఒకటి, నరుకుళ్లపాడు మేజర్‌పై మరొకటి



పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేస్తున్న తహసీల్దార్ దానియేలు

పెదకూరపాడు: సాగునీటి సంఘాల నోటిఫికేషన్ పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మీసాల దానియేలు, సాగునీటి సంఘం ఎన్నికల అధికారి రామచంద్రరావు విడుదల చేశారు. పెదకూరపాడు-1, పెదకూరపాడు-2, పెదకూరపాడు-3, లింగంగుంట్ల, ముసాపురం, నరుకుళ్లపాడు మేజర్ పరిధిలో పాటిబండ్ల నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వారి వెంట అసిస్టెంట్ ఎన్నికల అధికారి గౌతమి, సూపరింటెండెంట్ తులసి రాములు పాల్గొన్నారు.

'భగవద్గీత అందరికీ మార్గదర్శకం'



గీతారాధనలో భక్తులతో కలిసి పాల్గొన్న భవఘ్ని గురూజీ దంపతులు

అమరావతి: వ్యాస భగవానుడు అందించిన మహోన్నతమైన జ్ఞానసంపద కలిగిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ ఆచరించి పూజించాలని భవఘ్ని గురూజీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వైకుంఠపురం వేదవ్యాస దేవాలయంలో గీతాజయంతిని పురస్కరించుకుని భగవద్గీతారాధన సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతజీవకోటిని సన్మార్గంలో నడిపించడానికి భగవద్గీత అందరికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేనంత ఆధ్యాత్మిక జ్ఞానసంపదను మహర్షులు మనకు అందించారన్నారు. వేదాలు, ఉపనిషత్తుల సారాంశమే భగవద్గీత అన్నారు. మహోన్నతమైన జ్ఞాన సంపద నిండి ఉన్న భగవద్గీతను రక్షించుకుంటూ నిరంతర పఠనంతో నిజజీవితంలో కూడా అనుసరించి భగవద్గీత గొప్పతనాన్ని సమాజానికి చాటాలన్నారు. తొలుత వేదవ్యాసుని మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భగవద్గీత గ్రంథానికి షేక్ సాయిబాబు, షేక్ బేబీ దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భవఘ్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, గీతా ప్రేమికులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ పర్యవేక్షణాధికారి పి.మాలతీదేవి

నకరికల్లు: వరిపంటలో దిగుబడులు 35 నుంచి 37 బస్తాల వరకు వస్తున్నట్లుగా అంచనా వేసినట్లు వ్యవసాయశాఖ పర్యవేక్షణాధికారి పి.మాలతీదేవి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో బుధవారం వరిలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 756-17లో గల మేచారపు ఆంజనేయులు అనే రైతు పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు తెలిపారు. 5 మీటర్ల పొడవు, 5మీటర్ల వెడల్పు గల వరిపొలంలో వరిపంట నూర్పిడి చేసి తూకం వేయగా 17.540 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. వచ్చిన దిగుబడిని బట్టి ఎకరాకు 35 నుంచి 37 బస్తాల దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశామన్నారు. కార్యక్రమంలో ఇన్స్యూరెన్స్ కో-అబ్జర్వర్ పి.గోపి, వ్యవసాయ విస్తరణాధికారి ఎం.ప్రసన్నకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎం.సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'..

నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ రబీలో సాగు చేసేపంటలకు రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. డిసెంబర్ 31వతేదీ లోగా బీమా ప్రీమియం చెల్లించి బీమాకు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగోతు దాసయ్య, రైతులు పాల్గొన్నారు.

15న నవోదయ మోడల్ టెస్ట్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక గీతమ్స్ హైస్కూల్‌లో ఈ నెల 15వ తేదీన నవోదయ ఎంట్రన్స్ పరీక్ష మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి తెలిపారు. గీతమ్స్ విద్యాసంస్థల వారి ఆధ్వర్యంలో జరిగే ఈ టెస్ట్ 15న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. వివరాలకు 7013800787, 6304491025 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీపై సమీక్ష

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం వినుకొండ నియోజకవర్గస్థాయి రివ్యూ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సిద్ధలింగమూర్తి పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో నేడు జాబ్‌మేళా

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి తమ్మాజీరావు బుధవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలన్నారు. 18సంవత్సరాలు నుంచి 40 ఏళ్లలోపువారు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మేళాకు హాజరయ్యేవారు విద్యార్హతా ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల లోపు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 8074393466, 9494986164 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు పాటిబండ్లలో రెవెన్యూ సదస్సు

పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల రెవెన్యూ గ్రామంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూపరమైన సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులో పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు.

మద్యం బెల్టుషాపులపై దాడులు

నకరికల్లు: మండలంలోని మద్యం బెల్టుషాపులపై దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చల్లా సురేష్ బుధవారం తెలిపారు. కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లో దాడులు నిర్వహించగా కుంకలగుంటలో 35 మద్యం బాటిళ్లు, చేజర్లలో 51 మద్యం బాటిళ్లు గుర్తించామన్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం కేసులో టీడీపీ నేత అరెస్ట్

60 మద్యం సీసాలు స్వాధీనం

సత్తెనపల్లి (ముప్పాళ్ళ): సత్తెనపల్లి మండలంలోని భీమవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకుడు వెంకట్రావు అక్రమ మద్యం అమ్ముతున్నాడనే సమాచారంతో మంగళవారం రాత్రి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక బృందం సభ్యులు దాడి చేసి 60 మద్యం సీసాలు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొన్నారు. వెంకట్రావుపై కేసు నమోదు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ప్రారంభమైన ఎఫ్ఏ-1 పరీక్షలు

యడ్లపాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం సంగ్రహణాత్మక మదింపు (ఎఫ్ఏ-1) పరీక్షలు ఉపాధ్యాయులు నిర్వహించారు. సంబంధిత ప్రశ్నాపత్రాలను మండల విద్యావనరుల కేంద్రం నుంచి అందించారు. విద్యా మార్గదర్శకాల ప్రకారం పరీక్ష నిర్వహణకు గంట ముందు మాత్రమే పాయింట్ నుంచి ప్రశ్నాపత్రాలు హెచ్‌ఎంలకు ఇవ్వడం జరిగింది. మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న 4,066 మంది విద్యార్థులు ఈ పరీక్షలు హాజరైనట్లు రాశారు. ఇప్పటికే సిలబస్‌ను ఉపాధ్యాయులు పూర్తి చేసి విద్యార్థులను సమాయత్తం చేశారు. ఒకటి నుంచి 5 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6,8,10 తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు, ఇక 7,10 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను మండల విద్యాశాఖ అధికారులు 1,2 టి రత్నా, ఎం.అరుణకుమారి పర్యవేక్షించారు.

డాల్ మిల్లులో చోరీ

నాదెండ్ల: గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఏఎంజీ ఎదురుగా ఉన్న డొంక రోడ్డులో రైస్ అండ్ డాల్ మిల్లులో చోరీ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు విజయ వాసవీ డాల్ అండ్ రైస్ మిల్లులో మంగళవారం తెల్లవారుజామున దొంగలు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.4.35 లక్షల నగదును దోచుకెళ్ళారు. మిల్లు పార్టనర్ కనకం లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి 10-మంగళవారం ఉదయం మధ్యలో చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

భార్యపై సుత్తితో దాడి

చిలకలూరిపేటటౌన్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెపై సుత్తితో దాడిచేయగా తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పసుమర్రు గ్రామానికి చెందిన గుంజి నాగరాజు, గుంజి ఆదిలక్ష్మి దంపతుల మధ్య అనుమానం అనే వివాదంతో చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటలకు ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆవేశంగా నాగరాజు భార్య ఆదిలక్ష్మి తలపై సుత్తితో మోదాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆదిలక్ష్మిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు చేశారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆదిలక్ష్మి కుమారుడు గుంజి నవీన్‌గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.